https://teluguislam.net



# 8- ఆఖరి చహార్షుంబా

సఫర్ నెలకు చెందిన చివరి వారంలో ఉన్న బుధవారాన్ని ఊరుబయటకు వెళ్ళి పచ్చగడ్డిపై నడవటం పుణ్య ఆచారంగా భావిస్తారు. ఎందుకంటే? ఆ రోజే ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి స్వస్థత లభించినది, మరియు ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) సరదాగా ఆ రోజు పచ్చగడ్డిపై నడిచారని అంటారు. దాని కారణంగా ప్రజలు భార్యపిల్లలతో కలిసి పార్కులలో, తోటలలో షికార్లు చేస్తారు. దానిని ప్రవక్త ఆచారం అని అంటారు.

ఆ సాకుతో కొంత మంది ప్రజలు సఫర్ నెల చివరి బుధవారం తమ ఇండ్లల్లో మంచి వంటకాలు చేసుకొని, స్నానాలు చేసుకొని, క్రొత్త దుస్తులు ధరించి, బాగా అందంగా తయారయ్యి, అందాల పోటీల సభలలో పాల్గొన్నట్లు ముస్తాబు అవుతారు. చిన్నాపెద్ద, ఆడామగా అనే తేడా లేకుండా పార్కుల్లో, తోటల్లోకి పోయి ఏ విధంగా కలిసి మెలిసి షికార్లు చేస్తుంటారనేది మనం చెప్పనక్కర లేదు.

## ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) చివరి రోజులు:

సఫర్ నెల చివరి బుధవారం రోజున ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి స్వస్థత లబించిందా అంటే? దానికి జవాబు కానేకాదు. ఎందుకంటే? **''అర్రహీఖుల్ మఖ్తూమ్''** తెలుగు పేజి: 813లో ప్రవక్త గారి గురించి ఇలా ఉంది: ''ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) మరణానికి అయిదు రోజుల ముందు బుధవారం రోజున ఆయన (సల్లల్లాహు అలైహి

వసల్లం) శరీర ఉష్ణోగ్రత(జ్వరము) మరింత పెరిగిపోయింది. ఆ కారణంగానే ఆయన బాధ బాగా ఎక్కువై అపస్మారక పరిస్థితి ఏర్పడింది.''

నిజమేమంటే ఆ రోజే ఆయన అస్వస్థకు గురికాబడ్డారు. కాని మనం స్వస్థత చేకూరిందంటూ సంతోషాలు జరుపుకోవడం ధర్మమేనా? దాని వలన మనకు పుణ్యం ప్రాప్తిస్తుందా? లేక పాపం ప్రాప్తిస్తుందా? మనం ఆఖరి చహార్షుంబా పేరుతో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చరిత్రనే తప్పుగా ప్రచారం చేయడం లేదా?

ప్రియమైన ముస్లిములారా! ఆఖరి చహార్షుంబా అంటూ ప్రత్యేకమైన ఎలాంటి పుణ్యకార్యం లేదు. మరియు సఫర్ నెల గురించి ఇస్లాం ధర్మంలో ఎలాంటి అపశకునాలు లేవు. అసలు అలాంటి అపశకునాలకు గురికాకూడదని ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా హెచ్చరించారు:

**لَا عَدْوَى وَلَا طِيَرَةَ وَلَا هَامَةَ وَلَا صَفَرَ** ...(رواه البخاري:5316 – مسلم:4116 )

**''అంటు(వ్యాధుల) దుశ్శకునం అనేవి ఒట్టిమాటలే. అపశకునాలు లేవు, గుడ్లగుబా  కేకల వలన ఎలాంటి ప్రభావం లేదు, మరియు సఫర్ (నెల) ఏమి కాదు...''** (బుఖారీ: 5316, ముస్లిం: 4116)